క్లుప్తంగా

1097 గ్రూపులకు రూ. 8.16 కోట్ల మంజూరు

బల్లికురవ: ప్రభుత్వం వైఎస్సార్ ఆసరా పథకంలో మండలంలోని 1097 పొదుపు గ్రూపులకు 8.16 కోట్లు నిధులు మంజూరు చేసిందని వైఎస్సార్ కేపీ ఏపీఎం బీ. సురేంద్ర బాబు సోమవారం తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి 2019 ఎన్నికలకు ముందు ప్రజా సంకల్పయాత్రలో ఇచ్చిన హామీ మేరకు ఇప్పటివరకు ఆసరా సొమ్ము 4 విడతల్లో రూ.32.63 కోట్లు చెల్లించారని చెప్పారు. 5వ విడత మంగళవారం అనంతపురం జిల్లా ఉరవకొండలో బటన్ నొక్కి విడుదల చేస్తారని, అసరా ఉత్సవాల్లో భాగంగా ఈ మాసాంతంలోపు మహిళల ఖాతాలకు సొమ్ము జమ చేస్తారని ఏపీఎం వివరించారు.

పోలీసులను ఆశ్రయించిన ప్రేమజంట

అద్దంకి రూరల్: గత మూడు సంవత్సరాల నుంచి ప్రేమించుకుంటున్న అద్దంకికి చెందిన ప్రేమికులు ఆదివారం హైదరాబాద్‌లో వివాహం చేసుకుని ఒక్కటయ్యారు. ఈ ప్రేమ జంట తమకు తల్లిదండ్రుల నుంచి ప్రమాదం ఉందని భావించి సోమవారం అద్దంకి పోలీసు స్టేషన్‌ను ఆశ్రయించారు. యువతి ఫిర్యాదు మేరకు ఎస్సై వెంకటేశ్వర్లు తల్లిదండ్రులను పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చారు.

శింగరకొండలో ప్రత్యేక పూజలు



తులసీదళాల అర్చనలో స్వామివారు

అద్దంకి రూరల్: అయోధ్యలో బాల రాముడి ప్రాణప్రతిష్ట సందర్భంగా సోమవారం ప్రముఖ పుణ్యక్షేత్రమైన శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవస్థానంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. దీనిలో భాగంగా స్వామివారి ఉత్సవ విగ్రహాలకు తులసీదళాలతో అర్చన నిర్వహించారు. శ్రీరామ కీర్తనలతో భజనా కార్యక్రమం చేపట్టారు. పాల్గొన్న భక్తులకు ఆలయ అర్చకులు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమాన్ని దేవస్థాన అసిస్టెంట్ కమిషనర్ టి. సుభద్ర ఏర్పాట్లను పర్యవేక్షించారు.



మేదరమెట్ల వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో పూజలు చేస్తున్న మహిళలు



ఉప్పరపాలెం రామాలయంలో భక్తుల భజనలు



ఓంకార క్షేత్రంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్సీ సునీత

- ఊరూరా రామ నామస్మరణ
- అయోధ్యలో బాల రాముడి ప్రాణప్రతిష్ట
- పులకించిన భక్తజనం

జగదభి రాముడు.. శ్రీరాముడే

అద్దంకి/అద్దంకి రూరల్/బల్లికురవ/మేదరమట్ల/జే.పంగులూరు: మర్యాద పురోషత్తముడు, దశరథ పుత్రుడు, పితృవాక్య పరిపాలకుడు, ఏకపత్నీవ్రతుడు, నీలమేఘ శ్యాముడు అయినా బాల శ్రీరాముడి (రామ్ లల్లా) విగ్రహాన్ని అయోధ్యలో వైభవంగా ప్రాణ ప్రతిష్ట చేశారు. ఈసందర్భంగా సోమవారం యావత్ భారతం మొతం జైశ్రీరామ్ నామస్మరణతో మార్మోగిపోయింది. ఏ ఊరు చూసినా ఏ వీధి చూసినా రామనామ స్మరణతో హోరెత్తిపోయాయి. పంగులూరు గ్రామంలో రామ భక్త బృందం ఆధ్వర్యంలో రాముల వారి చిత్ర పటాన్ని గ్రామంలో ఊరేగించారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. భక్తులకు రాముల వారి తలంబ్రాలు అందించారు.

■ అయోధ్యలో బాల రాముడి ప్రతిష్ట వేడుకల సందర్భంగా కొరిశపాడు మండలంలోని పలు గ్రామాలల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అందులో భాగంగా మేదరమెట్లలోని వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో ఉదయం నుంచి ప్రత్యేక ప్రార్ధనలు, పూజలు నిర్వహించారు. మహిళా భక్తుల శ్రీరామ సంకీర్తనలతో ఆలయ పరిసరాలు మార్మోగాయి.

■ బల్లికురవ మండలంం కొప్పరపాడు కోదండరామాలయంలో ఉత్సవ విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించిన ట్రాక్టర్‌పై ఉంచి మేళతాళాలు డప్పువాయిద్యాలతో గ్రామోత్సవం చేపట్టారు. స్వామివార్లకు ప్రతి ఇంటా వార్లు పోసి హారతులిచ్చారు. వేడుకల్లో భాగంగా గ్రామానికి చెందిన రాధాకృష్ణ, టీటీడీ కోలాట బృందాలచే కోలాట ప్రదర్శన చేపట్టారు.

■ అద్దంకిలోని గీతా మందిరంలో ప్రత్యేక హోమాలు, శ్రీరాముని కల్యాణం నిర్వహించారు. అయోధ్యలోని బాలరాముడి ప్రాణ ప్రతిష్ట వేడుకలను భక్తుల చూసేందుకు ప్రత్యేక స్క్రీన్‌ను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో భక్తులు ప్రతిష్ట కార్యక్రమం జరుగుతున్న సేపు జై శ్రీరామ్ అంటూ నినాదాలు చేశారు. ప్రతిష్ట అనంతరం కార్యక్రమ నిర్వాహకులు భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఎటు చూసినా.. శ్రీరామ నామ స్మరణే

యద్దనపూడి/కారంచేడు/చినగంజాం/మార్టూరు: ఆయోధ్యలో బాల రాముల వారి ప్రాణప్రతిష్ట పురస్కరించుకొని గ్రామాల్లోను శ్రీరామ నామస్మరణతో మారుమోగింది. మండల కేంద్రం కారంచేడు చెరువుకట్ట మీద ఉన్న రామాలయంలో హరేరామ ఆశ్రమ పీఠాధిపతులు ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ప్రత్యేక పూజా కార్యక్రమం నిర్వహించారు. రామాలయం నుంచి పెద బజారు సెంటర్, చిన వంతెన సెంటర్ మీదగా కాలువ సెంటర్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఉప్పరపాలెం రామాలయంలో, స్వర్ణ ఆంజనేయ స్వామి గుడిలోను రాములోరికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. యద్దనపూడి మండలం పూనూరు వేణుగోపాల స్వామి, రామాలయం, కోదండ రామాలయం, అనంతవరం వేణుగోపాలస్వామి, యనమదల ఆంజనేయస్వామి ఆలయాల్లో విశేష పూజలతో పాటు ప్రత్యేకంగా అలంకరించిన వాహనాలపై సీతారామలక్ష్మణ సమేత హనుమాన్ చిత్రపటాలను ఊరేగిస్తూ శోభాయాత్ర నిర్వహించారు. శ్రీరామ నామ కషాయ జెండాలను పట్టుకొని బాణసంచా కాలుస్తూ ముందుకు సాగారు.

■ చినగంజాం వాసవి కన్యకా పరమేశ్వరి మందిరంలో రామ్‌లల్లా ప్రాణ ప్రతిష్ట పురస్కరించుకుని పూజలు అన్న సంతర్పణ నిర్వహించారు. సోపిరాలలో రాముల వారి ఉత్సవ విగ్రహాలను ఊరేగింపు , మహిళలు కోలాటం, మున్నంవారి పాలెం గ్రామంలో రాముల వారి విగ్రహాలను డప్పు వాయిద్యాలు కాషాయ జెండాలతో ఊరేగింపు నిర్వహించారు. సీతారామ పురం గ్రామానికి చెందిన సూర్యవంశ, అగ్నికుల క్షత్రియులు వేడుకల్లో పాల్గొన్నారు. 500 ఏళ్ల తరువాత తమ వంశీకుల చరిత్ర ఆనవాయితీగా ప్రాణప్రతిష్ట సందర్భంగా ప్రత్యేక తల పాగాలు, తోలు పాదరక్షలు ధరించారని వారి పిలుపు మేరకు సీతారామ పురం గ్రామంలోని సూర్యవంశ అగ్నికుల క్షత్రియులు అదే విధంగా తల పాగాలు, పాద రక్షకులు ధరించి వేడుకలు ఘనంగా నిర్వహించినట్లు వారు తెలిపారు. చింత గుంపల్లె గ్రామంలోని రుక్మిణీ సమేత సత్యభామ వేణుగోపాలస్వామి, ప్రసన్నాంజనేయ స్వామి ఆలయంలో 24 గంటల పాటు ఏకాహం, హరే రామ సంకీర్తనం, భజనలు నిర్వహించారు.

■ మార్టూరు మండలం కోలలపూడి గ్రామంలోని శ్రీకోదండ రామాలయంలో ప్రత్యేక పూజలు రాముల వారి ఊరేగింపు భజన కార్యక్రమం నిర్వహించారు. తాటివారిపాలెం గ్రామ రామాలయంలో హోమగుండంతో యజ్ఞం నిర్వహించి ప్రత్యేక పూజలు అనంతరం అన్నదానం నిర్వహించారు. రాజుపాలెం, ఇసక దరిశి, మార్టూరు తదితర గ్రామాలలోని వైష్ణవ, ఆంజనేయ స్వామి ఆలయాలలో భక్తులు పెద్ద ఎత్తున ప్రత్యేక పూజలు నిర్వహించారు.

■ **చీరాల అర్బన్/వేటపాలెం:** అయోధ్యలో బాల శ్రీరాముని ప్రాణ ప్రతిష్ట సందర్భంగా వీధివీధినా జై శ్రీరాం నినాదాలతో మారుమోగాయి. వీధుల్లో కాషాయ రంగుతో కూడిని శ్రీరాముని చిత్రంతో కూడి జండాలు ఇంటింటి పైనా రెపరెపలాడాయి. పందిళ్లపల్లిలో అయోధ్య శ్రీరాముడి ప్రతిష్ట సందర్భంగా గ్రామంలో శోభాయాత్ర నిర్వహించారు.



చీరాల: పూజా కార్యక్రమాల్లో పాల్గొన్న నియోజకవర్గ సమన్వయకర్త వెంకటేష్



పూనూరు కోదండ రామాలయంలో పూజలు నిర్వహిస్తున్న విశ్వహిందు పరిషత్ సభ్యులు

కొత్తపేటలోని ఓంకార క్షేత్రంలో శ్రీరాములవారి కళ్యాణ మహోత్సవంలో రాష్ట్ర వైఎస్సార్ సీపీ, మహిళా అధ్యక్షురాలు ఎమ్మెల్సీ పోతుల సునీత పాల్గొని స్వామి వారిని దర్శించుకొన్నారు. స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో నక్కల శ్రీనివాసరెడ్డి, కే రాంబాబు, అవ్వారు ఆదినారాయణ పాల్గొన్నారు.



పంగులూరు గ్రామంలో ఊరేగిస్తున్న రాముల వారి చిత్రపటం



కారంచేడులో భారీ ర్యాలీ నిర్వహిస్తున్న గ్రామస్తులు



కొప్పరపాడులో కోలాట ప్రదర్శన చేస్తున్న కళాకారులు



కోలలపూడి కోదండ రామాలయంలో భజన చేస్తున్న భక్తులు



కొప్పరపాడులో ఉత్సవ విగ్రహాల గ్రామోత్సవం



అద్దంకిలోని గీతా మందిరంలో చేపట్టిన హోమంలో పాల్గొన్న భక్తులు



అద్దంకిలో ప్రాణప్రతిష్ట కార్యక్రమాన్ని ప్రత్యేక స్క్రీన్‌పై చూస్తున్న భక్తులు



సీతారామపురంలో ఊరేగింపు నిర్వహిస్తున్న సూర్యవంశ, అగ్నికుల క్షత్రియులు

అభివృద్ధి పనులకు పచ్చజెండా

అద్దంకి: స్థానిక మున్సిపల్ కార్యాలయంలో సోమవారం చైర్మన్ లక్కెనబోయిన ఎస్తేరమ్మ ఆధ్యక్షతన మున్సిపల్ సాధారణ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో సీనియర్ అసిస్టెంట్ అర్జునరావు అజెండా చదివి వినిపించారు. అజెండాలోని అంశాలను కౌన్సిల్ ఏకగ్రీవంగా ఆమోదించారు. 31 అంశాల్లో వీధి దీపాల నిర్వహణ, సీసీ డ్రైన్‌లు, సీసీ రహదారులు, 8వ వార్డులోని శ్మశాన వాటిక అభివృద్ధి, నంబూరివారిలోని శ్మశానం వద్ద టాయిలెట్ల నిర్మాణం తదితర అంశాలున్నాయి.



మాట్లాడుతున్న చైర్మన్ ఎస్తేరమ్మ

సమావేశంలో వైస్ చైర్మన్లు దేశు పద్మేశ్, కే అనంత లక్ష్మి, కౌన్సిలర్లు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

అద్దంకి రూరల్: ప్రతి ఒక్కరూ శుభ కార్యక్రమాలను పుస్కరించుకుని మొక్కలు నాటడం అలవాటు చేసుకోవాలని అద్దంకి అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు మన్నం త్రిమూర్తులు అన్నారు. సోమవారం అయోధ్యలోని బాల రాముడి ప్రాణ ప్రతిష్ట సందర్భంగా పట్టణంలోని వేలమూరిపాడు రోడ్డులో ఉన్న పంచముఖ ఆంజనేయస్వామి దేవస్థాన ఆవరణలో ఉసిరి మొక్కలు నాటారు. కార్యక్రమంలో నర్రా శ్రీలక్ష్మీ, రాచమల్లు శివాంజనేయులు, జాగర్లమూడి హనుమయ్య, భాస్కరరావు, పేరం సుధాకర్‌రెడ్డి, నర్రా గోపాల్, రామ్మోహనరావు, కొప్పోలు హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.



మొక్కలు నాటుతున్న వృక్ష ప్రేమికులు

ఓటర్ల తుది జాబితా విడుదల

మేదరమెట్ల: కొరిశపాడు మండలంలోని పదిహేను పంచాయతీలకు చెందిన ఓటర్ల జాబితాను తహశీల్దార్ సుశీల సిబ్బందితో కలసి సోమవారం విడుదల చేశారు.



మేదరమెట్లలో జాబితా విడుదల చేస్తున్న అధికారులు

బల్లికురవ: ప్రతి ఒక్కరు స్వేచ్ఛగా నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకోవాలని తహశీల్దార్ కె. రవి బాబు కోరారు. స్థానిక కార్యాలయంలో మండలంలోని 56 పోలింగ్ బూత్‌లకు సంబంధించి తుదిజాబితాల విడుదలతో బీఎల్‌వోలకు అందజేశారు. మండలంలో పురుషులు 2671 , స్త్రీలు 43512 మంది ఓటర్లు ఉన్నారని చెప్పారు. కార్యక్రమంలో డిటీ రవికుమార్, బీఎల్‌లు పాల్గొన్నారు.

అద్దంకిలో ఓటర్లు 241081

అద్దంకి రూరల్: జిల్లా ఎన్నికల అధికారులు సోమవారం విడుదల చేసిన ఓటర్ల తుది జాబితా ప్రకారం అద్దంకి నియోజకవర్గంలో పురుషులు 118159, స్త్రీలు 122910, థర్డ్ జెండర్‌లు 12 మంది మొత్తం 241081 మంది ఓటర్లు ఉన్నట్లు జాబితాలో ప్రకటించారు.

ఆరోగ్యంపై న్యాయవాదులు శ్రద్ధ వహించాలి

చీరాల రూరల్: నిత్యం ఒత్తిడిని ఎదుర్కొంటూ విధులు నిర్వర్తించే న్యాయవాదులు తమ ఆరోగ్యాలపై శ్రద్ధ వహించాలని సీనియర్ సివిల్ జడ్జి ఎం. సుధ పేర్కొన్నారు. స్థానిక కోర్టు భవన సముదాయంలోని బార్ అసోసియేషన్ హాలులో సోమవారం రమేష్ డయాగ్నోస్టిక్స్ ఆధ్వర్యంలో ఉచిత స్పెషల్ మెడికల్ క్యాంపు నిర్వహించారు. న్యాయమూర్తి సుధ ముఖ్య అతిథిగా పాల్గొని మెడికల్ క్యాంపును ప్రారంభించారు. ఈ సందర్భంగా 70 మంది న్యాయవాదులకు డయాగ్నోస్టిక్స్ నిర్వాహకులు టెక్నిషియన్ రమేష్ ఆధ్వర్యంలో ఉచితంగా బీపీ, షుగరు, ఈసీజీ వంటి పరీక్షలు నిర్వహించారు. న్యాయవాదుల సంఘ అధ్యక్షుడు గొరవ రమేష్‌బాబు మాట్లాడుతూ తాము అడిగిన వెంటనే న్యాయవాదులకు ఉచితంగా ఆరోగ్య పరీక్షలు నిర్వహించేందుకు ముందుకు వచ్చిన టెక్నిషియన్ రమేష్‌కు, సహకారమందించిన సీనియర్ న్యాయవాది పుల్లెల హరిబాబుకు ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో న్యాయవాదులు, న్యాయవాద గుమస్తాలు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

15 కుటుంబాలు వైఎస్సార్ సీపీలో చేరిక



పార్టీలో చేరిన వారితో సమన్వయకర్త చిన హనిమిరెడ్డి

అద్దంకి: మండలంలోని మోదేపల్లి గ్రామం వైస్సార్సీపీ నాయకులు నల్లపనేని శ్రీను ఆధ్వర్యంలో 15 కుటుంబాలు టీడీపీని వీడి వైఎస్సార్ సీపీలో చేరారు. సోమవారం అద్దంకి వైఎస్సార్ సీపీ నియోజర్గ సమన్వయకర్త పానెం చిన హనిమిరెడ్డి వీరికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడాతూ నియోజకవర్గంలో పార్టీ జెండా ఎగిరే విధంగా కార్యకర్తలు, నాయకులు పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పాల్గొన్నారు.

262 మంది రోగులకు పరీక్షలు

పర్చూరు (చినగంజాం): మండలంలోని పెదగంజాం గ్రామంలో ఒంగోలు కిమ్స్ వైద్య బృందంచే సోమవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. స్థానిక విజయలక్ష్మి మెడికల్ షాపు ఆధ్వర్యంలో నిర్వహించిన వైద్య శిబిరంలో 262 మంది రోగులకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. 65 మంది రోగులకు ఆరోగ్య శ్రీ, ఇఎస్ఐ, ఇహెచ్ఎస్ కార్డుల ద్వారా పలు రకాల శస్త్ర చికిత్సలు ఒంగోలు కిమ్స్ ఆసుపత్రిలో చేయనున్నట్లు వైద్యులు లత తెలిపారు. కార్యక్రమంలో ఆసుపత్రి సిబ్బంది షేక్ రఫీ తదతరులు పాల్గొన్నారు.

బైకు అదుపుతప్పి అన్నదమ్ములకు గాయాలు

మేదరమెట్ల: ద్విచక్ర వాహనం అదుపుతప్పి కిందపడటంతో అన్నదమ్ములిద్దరు తీవ్రంగా గాయపడ్డారు. ఈఘటన కొరిశపాడు మండలంలోని మేదరమెట్ల బైపాస్ రోడ్డుపై సోమవారం చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం పర్చూరు గ్రామానికి చెందిన పాలపర్తి వెంకటేశ్వర్లు, పాలపర్తి రాంబాబు అన్నదమ్ములు మోటారు బైకుపై పర్చూరు నుంచి నెల్లూరుకు బయలుదేరారు. మార్గమధ్యంలో మేదరమెట్ల జాతీయ రహదారి వద్ద బైకు అదుపు తప్పడంతో ఇద్దరూ రోడ్డు మార్జిన్‌లోకి వెళ్లి పడ్డారు. సమాచారం తెలుసుకున్న మేదరమెట్ల పోలీసులు క్షతగాత్రులను ఒంగోలు జీజీహెచ్‌కు తరలించినట్లు, ఈమేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.



ఘటనా స్థలంలో పడిఉన్న క్షతగాత్రులు



కార్యక్రమంలో మాట్లాడుతున్న నియోజకవర్గ సమన్వయకర్త వెంకటేష్, వేదికపై ఆశీనులైన అతిథులు



మంత్రి నాగార్జునకు స్వాగతం పలుకుతున్న ఎమ్మెల్యే కరణం, వెంకటేష్



భారీ జన సందోహం మధ్య సభ వద్దకు చేరుకుంటున్న వెంకటేష్



సీఎం జగన్‌పై అభిమానం చాటుతున్న యువకుడు

సామాజిక సాధికార యాత్ర
విజయవంతం

క్షీరపురి సోమవారం జన సంద్రంతో పోటెత్తింది. వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో సామాజిక సాధికార యాత్ర సభ నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాజ్యసభ ఎంపీ మోపిదేవి వెంకటరమణ, బాపట్ల పార్లమెంట్ సభ్యుడు నందిగం సురేష్, సాంఘిక శాఖ సంక్షేమ మంత్రి మేరుగు నాగార్జున, ఎమ్మెల్సీ సునీత, ఎమ్మెల్యే కరణం బలరాం, నియోజకవర్గ సమన్వయకర్త కరణం వెంకటేష్, పార్టీ అధికార ప్రతినిధి నాగార్జునయాదవ్, తదితరులు పాల్గొని మాట్లాడారు.

- సాక్షి నెట్‌వర్క్



సమావేశంలో పాల్గొన్న మేధావులు, తదితరులు